క్లుప్తంగా

నేడు మండల సమావేశం

రాజాం సిటీ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఎంపీపీ లావేటి సులోచన ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

బాధ్యతగా పనిచేయాలి


వీఏఏలు చేపట్టాల్సిన చర్యలను వివరిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: అగ్రికల్చర్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని అంబకండి రైతు భరోసా కేంద్రంలో మండలంలోని పలు ఆర్‌బీకేల పరిధిలోని వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్)లతో శుక్రవారం సమావేశమైన ఆయన.. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు చేయాల్సిన వ్యవసాయ పనులపై అవగాహన కల్పించారు. వేసవి దుక్కులు, పొడి దుక్కులు, ఇంకుడు గుంతలు తవ్వే పనులను రైతులతో చేయించాలన్నారు. నేలసారవంతానికి, అధిక దిగుబడులకు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం


వైద్య సేవలపై ఆరా తీస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి మణి

రాజాం: వర్షాకాలంలో మలేరియా వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, గ్రామాల్లో వైద్య సిబ్బందిని ముందస్తుగా అప్రమత్తం చేయాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఎన్ని మణి అన్నారు. బొద్దాం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో మలేరియా కేసులతో పాటు విషజ్వరాలపై ఆరాతీశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతీ శుక్రవారం డ్రైడేని పాటించేలా చూడాలని సూచించారు. జ్వరాలు ప్రబలిన గ్రామాల్లో వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సేవలందించాలని డాక్టర్ సిద్ధీశ్వరికి ఆదేశించారు.

'ఉపాధి' మొక్కల పరిశీలన

రాజాం: మండలంలోని గార్రాజుచీపురుపల్లిలో ఉపాధి హామీ పథకం ద్వారా పలువురు రైతులకు అందజేసిన మొక్కల పెంపకాన్ని ఏపీవో సాయిరాం శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మొక్కల పెరుగుదల, సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆరాతీశారు. ఉపాధి పథకం ద్వారా కావాల్సిన వారికి కొబ్బరి మొక్కలతో పాటు జీడిమామిడి, దానిమ్మ, సపోటా, బత్తాయి వంటి పండ్ల మొక్కలను ఉచితంగా అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నివేదిక తయారు చేయండి

రామభద్రపురం: స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రభుత్వం ద్వారా ప్రతీ ఇంటికి మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వాటి స్థితిగతులపై నివేదిక తయారు చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణతో కలిసి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశమైన ఆమె..మండలంలోని ఓడీఎఫ్ గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాల్లో కూడా ఎన్ని మరుగుదొడ్లు నిర్మించారు.. వాటిలో ఎన్ని వినియోగంలో ఉన్నాయి.. వినియోగంలోకి తీసుకురావాల్సినవి ఎన్ని.. ఉన్నాయో సర్వే చేసి, నివేదిక సమర్పించాలని సూచించారు.

56 మందికి వైద్యసేవలు


వైద్యసేవలు అందిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి హాజరైన 56 మందికి వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు అందజేశారు. మోకాళ్ల నొప్పులు, కీళ్లవాతం, రక్తపోటు, మధుమేహం, చర్మవ్యాధులు, జలుబు, దగ్గు, ఆయాసం నివారణకు ఆయుర్వేద మందులు బాగా ఉపయోగపడతాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియదర్శిని, ఏఎన్‌ఎం పిసిని రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..

బొబ్బిలి రూరల్: ఉద్యోగులకు వారు విధి నిర్వహణలో చేసిన మంచి సేవలే వారికి గుర్తింపునిస్తాయని వక్తలు ప్రశంసించారు. మండలంలోని పెంట గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరిపి చిన్నారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను పాఠశాల సిబ్బంది శుక్రవారం సన్మానించారు. అనంతరం విద్యార్థుల విద్యాప్రగతికి ఆయన చేసిన సేవలను సిబ్బంది వివరించారు.

నాడు శిథిలం.. నేడు సుందరం


నాడు శిథిలావస్థలో రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల


నేడు కార్పొరేట్‌కు దీటుగా తయారైన పాఠశాల

ఈ చిత్రంలో కనిపిస్తోంది.. రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. గతంలోని టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అప్పట్లో ఇది చాలా అధ్వానంగా ఉండేది. శిథిలావస్థకు చేరుకున్న భవనంలో విద్యార్థులు కూర్చొనేందుకు పెచ్చులూడిన గచ్చులు, సరైన తలుపులు లేని తరగతి గదులు మాత్రమే ఉండేవి. మౌలిక సదుపాయాలు మచ్చుకైనా కనిపించేవి కావు. పాఠశాల పరిసరాలు పిచ్చిమొక్కలతో గోతులమయంగా ఉండేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు-నేడు పనుల ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త సొబగులు అద్దింది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. ఈ క్రమంలో అత్యంత సుందరంగా తయారైన ఇక్కడి పాఠశాలను చూసి, ఇది కదా అభివృద్ధి అని పలువురు మెచ్చుకుంటుండడం విశేషం.


నాడు తలుపులు లేని మరుగుదొడ్లు


నేడు కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు

– రామభద్రపురం.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే శంబంగి


ఏజెంట్లకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూలో జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో పార్టీ తరఫున నియమించిన ఏజెంట్లంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏజెంట్లతో సమావేశమై కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి పలు సూచనలు చేశారు. నిర్దిష్ట సమయానికి కౌంటింగ్ హాల్‌కు చేరుకోవాలని, ఈసీ నిబంధనలకు వ్యతిరేకంగా ఏ అంశమైనా మీ దృష్టికి వస్తే వెంటనే అక్కడి సూపర్‌వైజర్, ఇన్‌ఛార్జిలకు సమాచారం అందించాలన్నారు. ప్రతీ రౌండ్‌లోనూ లెక్కలు సరిచూసుకోవాలని సూచించారు. మొత్తం ఓట్లు, పార్టీల ప్రకారం వచ్చిన ఓట్లు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా జేసీఎస్ ఇన్‌చార్జి శంబంగి శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేణుగోపాలనాయుడు, న్యాయవాది మజ్జి జగన్నాథరావు, నాలుగు మండలాల జేసీఎస్‌లు, ఏజెంట్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్ల పంపిణీ జరగాలి

రాజాం: సకాలంలో పింఛన్ల పంపిణీ జరగాలని ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన.. జూన్ నెలకు సంబంధించి, మంజూరైన సామాజిక పింఛన్ల వివరాలను తెలిపారు. మండలంలోని మొత్తం 6,109 మంది లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదు జమ అవుతుందని, మరో 1,858 మంది లబ్ధిదారులకు నేరుగా వారి ఇంటికి వెళ్లి, పింఛన్ నగదు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. శనివారం నుంచే ఈ పంపిణీ జరగాలని, శతశాతం మందికి తొలిరోజే పింఛన్ అందేలా చూడాలన్నారు.


రాజాం: పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆంజనేయులు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 8,603 పింఛన్ లబ్ధిదారులు ఉండగా, వారిలో 2,368 మందికి ఇంటికి వెళ్లి, పింఛన్లు అందివ్వాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మిగతా వారికి నేరుగా బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు.

కొండవలసలో కార్డన్ సెర్చ్


కార్డన్ సెర్చ్‌కు సిద్ధమవుతున్న పోలీసులు

రేగిడి: మండలంలోని కొండవలస గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాం రూరల్ సీఐ శ్రీనివాస్, రేగిడి ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావులు సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి, అనుమానాస్పద వ్యక్తులు, ఎటువంటి ధ్రువపత్రాలు లేని వాహనాలపై ఆరాతీశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్నాయన్న సమాచారం అందుతోందని, ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు విడుదలవుతున్నాయని, ఆరోజు ఎవరూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దని గ్రామస్తులకు సూచించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. కార్డన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని మొత్తం 45 మోటార్‌బైక్‌లు, 8 లగేజీ ఆటోలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో వంగర ఎస్‌ఐ వీర జనార్దనరావు, సంతకవిటి ఏఎస్‌ఐ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం


రాజాం: పెనుబాకలో ధూమపానం వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది


బాడంగిలో నిర్వహించిన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో సీహెచ్‌సీ సిబ్బంది

రాజాం: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని ఎంఎల్‌హెచ్‌పీ వై.దేవమణి, ఏఎన్‌ఎం జి.యోగీశ్వరి హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా మండలంలోని పెనుబాక గ్రామంలో శుక్రవారం పర్యటించిన వారు.. పొగాకు తాగడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. పొగాకు, సిగరెట్లు, పొగాకు సంబంధిత పదార్థాలు తీసుకోవడం ద్వారా ఊపిరితిత్తులు పాడవ్వడమే కాకుండా క్యాన్సర్ బారినపడతారని తెలిపారు. ప్రతిఒక్కరూ ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు.

బాడంగి: మండల కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది కలిసి పొగాకు తాగడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పొగాకు తాగిన వారికి, పొగాకు పీల్చిన వారికి ఊపిరితిత్తులు దెబ్బతింటాయని, క్యాన్సర్ కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు నాగశేఖర్, అశాకృష్ణన్, గుణశేఖర్, హారిక, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

రేగిడి: విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్.వి.రమణ సూచించారు. స్థానిక విశ్వసాయి మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను వివరించారు. అలాగే రామాయణం, మహాభారతంలోని పలు అంశాలను తెలిపారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం


చేతుల శుభ్రతపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి

తెర్లాం: ప్రతీరోజు చేతులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. చేతుల శుభ్రత, రుతుక్రమం సమయంలో కౌమార బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెర్లాంలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీరోజు భోజనానికి ముందు, తరువాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేస్తే మలినాలు కడుపులోకి వెళ్లి వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. యుక్త వయస్సు బాలికలు రుతుక్రమం సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం చేతులు ఏవిధంగా శుభ్రం చేసుకోవాలో తెర్లాం-5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి బాలికలకు చేసి చూపించారు. కార్యక్రమంలో తెర్లాం-1,2 సచివాలయాల మహిళా పోలీసులు రమాదేవి, తులసీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

సంతకవిటి: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ తెలిపారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో రైతులతో శుక్రవారం సమావేశమైన ఆయన నవధాన్యాలు సాగు చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. నవధాన్యాలను పొలంలో వేసుకుని, అవి మొక్కలైన తర్వాత వాటిని నేలలో కలియదున్నుకోవాలని తద్వారా పంటకు కావాల్సిన పోషకాలు నేల ద్వారా అందుతాయన్నారు. అలాగే పంటకు పట్టే చీడపీడలు తగ్గి, ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం నవధాన్యాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు జయమ్మ, నీలవేణి, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సుదర్శన యాగం

రాజాం సిటీ: హనుమాన్ జయంత్యుత్సవాల్లో భాగంగా స్థానిక చీపురుపల్లి రోడ్డులోని వీరహనుమాన్ ఆలయంలో శుక్రవారం సుదర్శన యాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయ పూజారి రవిస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, సింధూరార్చనలు చేపట్టారు. ఈ పూజల్లో వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాలవలస పద్మావతిలు పాల్గొని, భగవంతుని ఆరాధించారు. సాయంత్రం బాలసంస్కార్ చిన్నారులతో ప్రదర్శించిన రామాయణం నాటిక ఆకట్టుకుంది.

బాడంగి: హనుమాన్ జయంత్యుత్సవాలకు మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. హనుమాన్‌ను అలంకరించడంతో పాటు భక్తుల దర్శనానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు.


రాజాం సిటీ: సుదర్శన యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ తదితరులు

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

రాజాం: స్థానిక బొబ్బిలి రోడ్డులోని తాగునీటి పైపులైన్ మరమ్మతులు అధికారులు శుక్రవారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఇక్కడి పైపులైన్‌కు పడిన లీకేజీ ద్వారా తాగునీరు వృథాగా పోతోంది. స్థానికుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఏఈ వెంకట్‌లు పైపులైన్ మరమ్మతు పనులు శుక్రవారం చేపట్టారు. లీకులు అరికట్టేందుకు అవసరమైన సామగ్రి విశాఖపట్నం నుంచి రావాల్సి ఉండడంతో మరమ్మతుల పూర్తికి ఒకరోజు సమయం పడుతుందని ఏఈ తెలిపారు. ఈ పైపులైన్ పరిధిలోని అమ్మవారి కాలనీ, మెంతిపేట, ఎస్సీ కాలనీ, ఆదర్శ నగర్, కొండంపేట, మాదిగ వీధి, బొబ్బిలి రోడ్డు, తెలగ వీధి, చాకలి వీధి, వస్త్రపురి కాలనీ, గోపాలపురం, కొత్తవలస, తిమ్మయ్యపేట, మల్లిఖార్జునకాలనీ, లచ్చయ్యపేట గ్రామాలకు శనివారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, పట్టణవాసులు గమనించి, సహకరించాలని కోరారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు సర్వే

వంగర: మండలంలోని గ్రామాల్లో ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు సర్వే చేపడుతున్నామని ప్రత్యేక ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మంనాయుడు, వై.సంగోజి తెలిపారు. మండలంలోని ఎం.సీతారాంపురం, బంగారువలస, వంగర, మగ్గూరు గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన వారు.. ఇంటింటికీ వెళ్లి, దివ్యాంగ పిల్లలు ఎవరైనా ఉన్నారా అని అడిగి, వివరాలు నమోదు చేశారు. అనంతరం దివ్యాంగ చిన్నారుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ఉచిత విద్యతో పాటు ఉపకరణాలను కూడా అందించడం జరుగుతోందన్నారు.

బొబ్బిలి: మండల పరిధిలోని మల్లంపేటలో ప్రత్యేక ఉపాధ్యాయులు రవి, కృష్ణమోహన్‌లు ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు సర్వే నిర్వహించారు. అలాగే దివ్యాంగులైన పిల్లల కోసం ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు.


వంగర: సర్వే చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


తెర్లాం: పిల్లలకు క్యారమ్ బోర్డు ఆటలోని మెలకువలు నేర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి


రామభద్రపురం: పిల్లలకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

తెర్లాం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం గ్రంథాలయానికి వచ్చిన చిన్నారులకు చెస్(చదరంగం), క్యారమ్ బోర్డు క్రీడలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండోర్ గేమ్‌లో భాగమైన చదరంగం ఆటతో మేధాశక్తి పెరుగుతుందని, అవుట్ డోర్ గేమ్‌లైన క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి ఆటలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు.

రామభద్రపురం: విద్యార్థులంతా వేసవి శిక్షణా శిబిరానికి హాజరై, సృజనాత్మకతను పెంపొందించుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని స్థానిక శాఖా గ్రంథాలయ నిర్వాహకురాలు సత్యవాణి కోరారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయానికి శుక్రవారం హాజరైన పిల్లలతో పుస్తకాలు, నీతికథలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించడం, ప్రముఖుల జీవిత చరిత్రలు తెలపడం, ఫజిల్స్, మెదడుకు మేత, యోగాసనాలు వంటి వాటిల్లో శిక్షణ ఇచ్చారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. స్థానిక మూడో అంగన్‌వాడీ కేంద్రంలో తెర్లాం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన ఆమె.. ప్రతిరోజూ నిర్ణీత సమయానికి కేంద్రాలు తెరవాలని, ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా వారికి పంపిణీ చేయాలన్నారు. కేంద్రాలకు సంబంధించిన అన్ని రికార్డులను ఆన్‌లైన్‌లోను, ఆఫ్‌లైన్‌లోనూ పూర్తిస్థాయిలో అప్‌డేట్ చేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో చిన్నారులకు వడ్డించిన పౌష్టికాహారాన్ని మహిళా పోలీసు శుక్రవారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు వండి పెడుతున్నారా లేదా అని చూసి, పలు సూచనలు చేశారు.

వంగర: మండలంలోని అరసాడ ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో బాలికల ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కల్యాణి మాట్లాడుతూ బాలికలు పీరియడ్స్ సమయంలో తగిన పరిశుభ్రతా చర్యలు పాటించాలని సూచించారు.


తెర్లాం: మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి


రేగిడి: చాటాయవలసలో అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

నిబంధనలు పాటించాలి

వంగర: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎంఈవో-1 ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. పలు సూచనలు చేశారు. పాఠశాలల గుర్తింపు, విద్యార్థుల నమోదు వివరాలు, పాఠశాలల పరిశుభ్రత వంటివి పక్కాగా ఉండాలని తెలిపారు.